## క్లుప్తంగా

### ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

రొద్దం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా ఏమైనా స్టాక్ ఉంచారా? అన్న దానిపై ఆరాతీశారు. అమ్మకం రికార్డులు, ఆన్‌లైన్ విక్రయం, రైతుల వివరాలు నమోదు, దుకాణంలో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. యూరియా స్టాక్ రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుకాణాల యజమానులు ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. అవకతవకలు లేకుండా ఎరువులు విక్రయించాలని ఆయన వారికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఆర్‌ఐ తదితరులు ఉన్నారు.

### రహదారి ఆక్రమణను అడ్డుకున్న తహసీల్దార్

పెనుకొండ రూరల్: కియా ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలో రహదారి ఆక్రమణను ఇన్‌చార్జ్ తహసీల్దార్ అడ్డుకున్నారు. వివరాలు.. చిన్నపరెడ్డిపల్లికి అనుసంధానంగా ఇండస్ట్రియల్ ఏరియాలోకి వెళ్లే రహదారిపై చిన్నపరెడ్డిపల్లికి చెందిన రైతు తిప్పన్న వరినాట్లు వేయించాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శనివారం అక్కడికి చేరుకుని దారి ఆక్రమణను అడ్డుకున్నారు. రహదారిపై రాకపోకలకు అంతరాయం కల్గించొద్దని తహసీల్దార్ రైతుకు సూచించారు.

### మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పెనుకొండ రూరల్: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించడం వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయడమేనన్నారు. మరోవైపు పేదలకు ఉచిత వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు శివకుమార్, రమేష్, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య విద్యార్థికి చేయూత



విద్యార్థికి నగదు అందిస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది

పెనుకొండ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు చేయూతనిచ్చారు. అడదాకుపల్లి గ్రామానికి చెందిన సతీష్ నాయక్ అనే విద్యార్థికి ఇటీవల నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు లభించింది. దాతల సహకారంతో అడ్మిషన్ పొందాడు. అయితే హాస్టల్ ఫీజు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రూ.10 వేలు సాయం అందించారు. శనివారం ప్రిన్సిపాల్ సుదర్శన్ చేతుల మీదుగా నగదును విద్యార్థికి అందజేశారు.

### ‘చలో విజయవాడ’ జయప్రదం చేయండి

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ సర్వే నంబరు 28లో ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు వ్యతిరేఖంగా ఈ నెల 24న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న కోరారు. ఈమేరకు శనివారం ఆయన గ్రామంలో రైతులతో కలిసి కార్యక్రమ పోస్టర్లు విడుదల చేశారు.

### రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

హిందూపురం టౌన్: రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ మహేష్‌లు అన్నారు. శనివారం రోటరీ క్లబ్ సౌజన్యంతో మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ఆయా బల్లలను చైర్మన్‌తో పాటు కమిషనర్, డీఎస్పీలు ప్రారంభించారు. బల్లల ఏర్పాటుకు రోటరీ క్లబ్ సభ్యులు నారాయణ, శివయ్య, రేపూరు అరుణ్ కుమార్, పోస్టల్ శ్రీనివాసులు, నంబూరి సుమంత్ ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలకు సహకరించండి





జిల్లా జడ్జిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జి అశోక్‌కుమార్, న్యాయవాదులు

హిందూపురం: పట్టణంలో కోర్టు నూతన భవన నిర్మాణాలకు సహకరించాలని జిల్లా జడ్జి భీమారావును స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శనివారం జిల్లా జడ్జి న్యాయస్థానం వార్షిక తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరప్ప, కార్యదర్శి రామచంద్రప్ప అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య కలిసి సమస్యలను వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయస్థానాలను పశుసంవర్ధక శాఖ భవనాల్లో నిర్వహిస్తున్నారని, దీంతో అటు న్యాయమూర్తులు, ఇటు న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, ఇందాద్, శివశంకర్, జయరాం, వెంకటేష్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

**మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ**

మడకశిర: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పచ్చదనంతో కరువును శాశ్వతంగా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అశ్వత్థనారాయణ, న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, క్రిష్టప్ప, నాగేగౌడ్, త్రిలోక్, సురేష్‌రాజు, నాగరాజు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఐ నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణాన్ని శుభ్రం చేశారు.

**చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**

మడకశిర: డ్రైవర్లు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలన్నారు. అతి వేగం ప్రమాదమని, మద్యం సేవించి వాహనాలు పడపడం నేరమన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



రొద్దంలో మొక్క నాటుతున్న పీడీ నరసయ్య

రొద్దం: మొక్కల పెంపకం సామాజిక బాధ్యత అని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమానికి హాజరైన ఆయన సచివాలయం -1 వద్ద మొక్కలు నాటారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఓఎస్డీ సుమన జయంతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, ఈఓఆర్డీ గోవిందప్ప పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు మొక్కలు నాటారు. కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు మొక్కలు నాటి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాకేష్, న్యాయవాదులు శ్రీనివాసులు, డి.నాగరాజు, డి.శ్రీనివాసులు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అధికారులు మొక్కలు నాటారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, ఎంఈఓ నాగరాజు పాల్గొన్నారు.

అగళి: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్బరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేపల్లి సచివాలయం, బీసీ హస్టల్, జిల్లా పరిషత ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఏపీఓ మంజునాథ్, ఈఓఆర్డీ పద్మ, డాక్టర్ శివనంద, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, మహేష్ పాల్గొన్నారు.

అమరాపురం: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రామరావు, ఈఓఆర్డీ సుధాకర్‌లు పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

చిలమత్తూరు: దేమకేతేపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ మొక్కలు నాటి నీరు పోశారు.

# వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



ఆనందరంగారెడ్డి, నితిన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి పేర్కొన్నారు. జక్కేపల్లికి చెందిన నితిన్‌రెడ్డిని పార్టీ అధిష్టానం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా శనివారం సిద్దగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన పార్టీ అండగా ఉంటుందని ఏవరు అధైర్య పడొద్దన్నారు. అనంతరం నితిన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్రఅధికార ప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, పట్టణాధ్యక్షులు సతీష్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు దశనాథ్‌రెడ్డి, మహిళ నేత అంజలి, కౌన్సిలర్ శ్రీనివాసులు, తాలుకా, మండల వివిధ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు సిద్దగంగప్ప, హరిప్రసాద్, తిప్పేస్వామి, జయరాజ్, దేవరాజు, గంగాధర్‌గౌడ్, తిమ్మప్ప, శివానంద్, శేషాద్రి, నాగభూషరెడ్డి, నరేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, భగవంతప్ప, చిన్నప్ప, రామకృష్ణ,రంగనాథ్, తేజేశ్వరెడ్డి, ప్రవీణ్‌కుమార్, గోవర్దన్, మైనార్టీ నేతలు వసీమ్, పక్రుద్దీన్, ఎంపీటీసీలు మూర్తి, రామచంద్రప్ప, సర్పంచ్ రంగనాథ్, నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



సి. అన్సర్ అహ్మద్



అమానుల్లా



ఎస్‌ఎం ఫారూఖ్

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులను నియమించారు. ఈమేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా చిలమత్తూరు మండలం కొడికొండకు చెందిన సి. అన్సర్ అహ్మద్, హిందూపురానికి చెందిన షేక్ అమానుల్లా, జాయింట్ సెక్రటరీగా ఎస్‌ఎం ఫారూఖ్‌ను నియమించారు.

# నిబంధనలు తప్పక పాటించాలి



కార్మిక సంఘ నేత రవితో మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి కిశోర్

హిందూపురం: పరిశ్రమలు హానికారక రసాయనాల విషయంలో తప్పక నిబంధనలు పాటించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి కిశోర్ సూచించారు. శనివారం ఆయన తూమకుంట పారిశ్రామికవాడలో ఫ్యాక్టరీ యాజమాన్యం, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ నిర్వాహకులు రసాయన మలినాలు, ఇతర హానికరమైన రంగులను విచ్చలవిడిగా పారవేయరాదన్నారు. ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పారిశ్రామికవాడలోని కార్మిక శాఖ యూనియన్ నేత రవికుమార్, ఇతర సంఘాల వారిని కలిసి ఫిర్యాదు తీసుకున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ రూరల్: 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చర్చించారు. గుర్తింపు పొందిన పార్టీలు పోలింగ్ బూత్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ సూచించారు.

### డాక్యుమెంట్ రైటర్ల నిరసన

హిందూపురం: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్‌తో డాక్యుమెంట్ రైటర్లు రెండో రోజూ శనివారం పెన్‌డౌన్ చేపట్టారు. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 విధానంలో చాలా లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్ల సంఘ నాయకులు చౌడేష్, లక్ష్మీనారాయణ, హనుమంతరెడ్డి, రాంప్రసాద్ జయరామకృష్ణ, ఆసీఫ్ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో హోంగార్డు మృతి



రహమాన్ (ఫైల్)

అమరాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు రహమాన్(43) అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యంతో వారం రోజుల నుంచి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తెలు ఉన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త బాబా తండ్రి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### పోలీస్‌స్టేషన్ తనిఖీ

సోమందేపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ నర్సింగప్ప శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్ఐతో పాటు సిబ్బందికి సూచించారు.

### ఇద్దరికి గాయాలు

అమరాపురం: పేలుబండ గ్రామం వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కె.శివరం గ్రామానికి చెందిన ఈరన్న, పేలుబండ గ్రామానికి చెందిన మంజప్ప బైక్‌పై వస్తూ పేలుబండ గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### కాంగ్రెస్ గూటికి జేడీఎస్ నాయకులు

పావగడ: వదనకల్ గ్రామానికి చెందిన సీనియర్ జేడీఎస్ నాయకులు తిప్పారెడ్డి, రవీంద్రరెడ్డి(బాలు), కెంచరాయ జేడీఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లోకి శనివారం చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ ఆ ముగ్గురికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు.

### ర్యాపిట అధ్యక్షురాలిగా శివమ్మ

పావగడ: నాగలమడక హోబళికి చెందిన ర్యాపిట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలి గా జేడీఎస్ మద్దతుదారురాలు శివమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో శివమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈఓ బీకే ఉత్తమ్ ప్రకటించారు. గ్రామ పంచాయతీ లో 14 మంది జేడీఎస్ సభ్యులు ఉండగా కేవలం ఒక్కరు మాత్రం కాంగ్రెస్ సభ్యుడు ఉండడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, ఎస్‌కే రెడ్డి, సొగడగు వెంకటేష్, రాజగోపాల్, వేణుస్వామి తదితరులు నూతన అధ్యక్షురాలిని ఘనంగా సన్మానించారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

రొళ్ల: కొడగార్లగుట్ట కాలనీ సమీపాన 544ఈ జాతీయ రహదారి పై ఓ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలు..పెనుకొండ కియా ఫ్యాక్టరీలో పని చేస్తున్న ముగ్గురు వ్యక్తులు పని నిమిత్తం కారులో కర్ణాటక రాష్ట్రం మంగళూరు వైపు వచ్చారు. కొడగార్లగుట్ట కాలనీ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో కారులో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు.


### ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలకు అనుమతి తప్పనిసరి

మడకశిర: పట్టణంలో ధర్నాలు, ర్యాలీలు, ఇతర ఆందోళన కార్యక్రమాలు నిర్వహణకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్థానిక అర్బన్ సీఐ నగేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా రాజకీయ పార్టీలు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమతి ఇచ్చిన తర్వాతే కార్యక్రమాలు చేయాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సర్పంచుకు పరామర్శ

గుడిబండ: మందలపల్లి సర్పంచు అశ్వత్ డెంగీ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం గ్రామానికి చేరుకుని సర్పంచ్‌ను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శేషాద్రి, నాయకులు బాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, రాణాప్రతాప్, మంజునాథ, హరి, నరేష్ తదితరులు ఉన్నారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

పెనుకొండ రూరల్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి బహుజన ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా నాయకులు శివరామకృష్ణ, ఎంఎస్ మూర్తి, రవి, నరసింహులు, రొద్దం బాబు, మారుతి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సంస్థ అనేక రంగాల్లో విశేష సేవలందిస్తోందన్నారు. అలాంటి సంస్థకు నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబుకు పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# సోలార్ కంపెనీల మాయలో పడొద్దు



రొద్దం రైతులతో చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

రొద్దం: సోలార్ కంపెనీల మాయలో పడి భూముల హక్కులను కోల్పోవద్దని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి రైతులకు సూచించారు. శనివారం చిన్నగువ్వలపల్లి, గోనిమేకులపల్లి, పెద్దగువ్వలపల్లి, రెడ్డిపల్లి, దొడగట్ట, వైడీరెడ్డిపల్లి, చిన్నమంతూరు, లక్సానిపల్లి, ఎస్ తిమ్మాపురం, చెరుకూరు తదితర గ్రామాల్లో రైతుల సంఘం నాయకులు పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ సోలార్ కంపెనీలు రైతుల భూములు లీజుకు తీసుకుని ఏడాదికి రూ.30 వేలు ఇస్తామని, లేదా ఎకరా రూ.5.25 లక్షలను కొనుగోలు చేస్తామని గ్రామాల్లో తమ ఏజెంట్ల ద్వారా రైతులను ప్రలోభ పెట్టే ప్రయత్నం చేస్తారన్నారు. రైతులు తొందరపడి సోలార్ కంపెనీలు, సెజ్‌లు, హబ్‌లు, ఏపీఐఐసీ కోసం మీ భూములను లీజుకు కానీ, అమ్మడానికి కానీ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళకంపెనీలకు భూమి కావాలంటే లీజు కింద ఏడాదికి ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని, రెండేళ్లకోసారి 20 శాతం కౌలు పెంచాలని, అగ్రిమెంట్ కాల పరిమితి గరిష్టంగా పదేళ్లకు మించకుండా ఉండాలన్నారు. సోలార్ కంపెనీ రైతులను మోసం చేయకుండా ప్రభుత్వం కౌంటర్ గ్యారెంటీ ఇవ్వాలన్నారు. కౌలు సందర్భంగా భూములకు సంబంధించిన ఒరిజినల్ డ్యాక్యుమెంట్లు రైతుల దగ్గరే ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫక్రోద్దీన్, రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేసులు, రైతులు పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: బుక్కపట్నంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ బుక్కపట్నంలో శ్రీ సంతోషిమాత డ్వాక్రా మహిళ సంఘంలో ఒక గ్రూపు లీడర్ మహిళ సభ్యులకి సంబంధించి దాదాపు రూ.8 లక్షల డబ్బును మోసం చేశారని, దీనిపై మోసపోయిన సభ్యులు కొంతమంది వెంకటేష్ దృష్టికి తీసుకురాగా, వెలుగు కార్యాలయంలో విచారించారన్నారు. అయితే ఈ అక్రమ డబ్బుతో సంబంధం ఉన్న బుక్ కీపర్ నాగరాజు, సీసీ రవీంద్ర వెంకటేష్‌పై దాడి చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము, కో కన్వీనర్ రామకృష్ణ, నాయకులు నందీశ్వర, సురేష్ కుమార్, సుబ్రహ్మణ్యం, గంగాధర, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ రూరల్: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ వీఆర్‌ఏలు శనివారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంతోపాటు తహసీల్దార్ స్వాతికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, నరసింహులు, వీఆర్‌ఏ సంఘం నాయకులు నరసప్ప, అంజినప్ప,లక్ష్మీకాంతమ్మ,సుశీలమ్మ,రాజేశ్వరి, రాధమ్మ పాల్గొన్నారు.

అమరాపురం: తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

### యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

చిలమత్తూరు: యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో పలు రైతు సేవా కేంద్రాలకు వస్తున్న యూరియా రాత్రి రాత్రే మాయం చేస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం పాతచామలపల్లి రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాలో రాత్రి రాత్రి 39 బస్తాలు మాయం చేశారని ఆరోపించారు. రాత్రి సమయాల్లో రైతులకు పంపిణీ చేశారో వ్యవసాయాధికారులు సమాధానం చెప్పాలన్నారు. వ్యవసాయాధికారులు, కూటమి నేతలు కుమ్మక్కు అయ్యి యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతులకు యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### క్రీడా స్ఫూర్తితో మెలగాలి

హిందూపురం టౌన్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, డీఎస్పీ మహేష్ అన్నారు. హిందూపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎన్‌కే పండిట్ స్మారకార్థం టాలెంట్ హంట్ అకాడమీ క్రికెట్ టోర్నీని శనివారం వారు ప్రారంభించారు. హెచ్.ఎన్.కే పండిట్ అధ్యక్షుడిగా హిందూపురంలో క్రికెట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన పేరిట క్రికెటర్లు టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హిందూపూర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రవికాంత్, ఆనంద్, నజ్మల్, దీపక్, నగేష్, సన్ని పండిట్, పీడీ లోకనాథ్ పాల్గొన్నారు.